నిర్వీర్యం చేయకపోవచ్చు. కానీ, నలుగురు చేసే పనిని ఒకరికి తగ్గించవచ్చు. ఉదాహరణకు ఓ పెద్ద లాయరు తను అందిపుచ్చుకున్న కేసును పలుకోణాల నుంచి చూసేందుకు జూనియర్ లాయర్ల అవసరం ఉంటుంది. పాత కేసులు తవ్వుతూ, వాటిలో తీర్పులను విశ్లేషిస్తూ, జడ్జి దేనికి ఎలా స్పందిస్తారో అంచనా వేస్తూ... ఆ జట్టు ఉపయోగపడుతుంది. ఇదంతా AI చేసేస్తే!



### లాభాలు లేకపోలేదు

- విద్య, వైద్య రంగాల్లో కృత్రిమ మేధ ఎంత ఉపయోగకరమో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. మరీ ముఖ్యంగా పేదరికం, నిపుణుల కొరత వల్ల నిరక్షరాస్యత, అనారోగ్యం లాంటి సామాజిక సమస్యలు ఉన్న దేశాలకు AI ద్వారా ఉపశమనం లభిస్తుంది.
- సైన్యం, కాపలా కోసం ఎంతో రక్షణ వ్యయం కావాలి. సైనికులూ నిరంతరం ప్రమాదంలో ఉంటారు. AI ద్వారా అంతే సమర్థంగా నిఘా వ్యవస్థను నడిపించవచ్చు. పహారా నుంచి ఆయుధాల ప్రయోగం వరకు కృత్రిమ మేధ నిర్ణయాలు తీసుకోగలదు.
- ఇప్పటికే డ్రైవర్ అవసరం లేని కార్లను టెస్లా అందుబాటులోకి తెచ్చింది. ఇందులో చిన్నపాటి లోపాలను సవరించగలిగితే... అసలు స్టీరింగ్ అవసరం లేని రోజులు వస్తాయి. చిన్న కార్ల నుంచి భారీ వాహనాల వరకు వాటంతట అవే దూసుకుపోవచ్చు.
- కాలుష్యాన్ని గమనించేందుకు, ప్రకృతి విపత్తులను అంచనా వేసేందుకు AI చాలా ఉపయోగపడుతుంది. AI for Earth లాంటి ప్రాజెక్టుల ద్వారా జీవజాతులను కాపాడే ప్రయత్నాలు జరుగుతున్నాయి.
- ఏదన్నా మందు కనుగొనాలన్నా, టీకా రూపొందించాలన్నా ఎన్నో పరీక్షలు అవసరపడతాయి. ఎలుకల నుంచి మనుషుల వరకు వేర్వేరు దశలలో వాటిని ప్రయోగించాల్సి ఉంటుంది. కానీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో జరగబోయే ప్రభావాన్ని ముందుగానే పసిగట్టే సామర్థ్యం ఉంటుంది.

### దాని పరిమితులు దానివి!

వేగంలోనూ, గుర్తుపెట్టుకోవడంలోనూ కృత్రిమ మేధ మనకంటే చాలా మెరుగ్గా ఉండవచ్చు. కానీ ఎంతైనా అదీ యంత్రమే! దానికీ పరిమితులు ఉన్నాయి.

- 2018లో ఉబర్ స్వయం చోదక వాహనాన్ని గుద్దుకుని ఓ వ్యక్తి చనిపోయాడు. ఆటోమేటిక్ కార్ల వల్ల జరిగిన తొలి మరణమది. అది మొదలు ఇప్పటికి చాలామందే సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల వల్ల చనిపోయారు. AI నియంత్రణ నూరు శాతం సురక్షితం అన్న నమ్మకాన్ని ఇవి చెరిపేస్తున్నాయి.
- చాట్ జీపీటీ కొన్ని వేల కోట్ల నష్టాన్ని చవిచూస్తున్నది. కారణం! అది పనిచేయడానికి ఉపయోగించే సర్వర్లు, GPU అనే అధునాతన చిప్స్ వల్ల చాలా ఖర్చవుతుంది. ఏ AI వ్యవస్థకైనా ఇది వర్తిస్తుంది. వాటిని రూపొందించేందుకు, నిర్వహించేందుకు, బాగు చేసేందుకు చాలా డబ్బే కావాలి.
- తనకు తానుగా నేర్చుకోవడం కృత్రిమ మేధకు ఉండాల్సిన ముఖ్య లక్షణం. అయితే ఈ నేర్చుకోవడంలో తీవ్రమైన పక్షపాతాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. ఉదాహరణకు ఓ పరిశోధనలో భాగంగా AI కి పాత నేరస్తులను చూపించినప్పుడు... వాళ్లను పోలినవారందరినీ కూడా నేరస్తులుగా భావించడం మొదలుపెట్టింది.
- కృత్రిమ మేధ వైద్యం చేస్తుంది... కానీ ఓ వైద్యుడు ఇచ్చే భరోసా అందించలేదు. సాటి మనిషి నుంచి అందే స్పర్శ, సాంత్వన... ఎన్ని సిలికాన్ తొడుగులు ఉన్న రోబోకైనా సాధ్యం కాదు. మనిషికే సొంతమైన ఉద్వేగం, ఎంత అధునాతన యంత్రానికైనా కృతకంగానే ఉంటుంది.
- ఒక సమాచారం గురించి అడిగినప్పుడు పత్రికల నుంచి పుస్తకాల వరకు...నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం నుంచి విషయసేకరణ చేస్తుంది AI. ఇది కాపీరైట్ సమస్యలకు దారితీస్తుంది. ఇప్పటికే మైక్రోసాఫ్ట్, ఓపెన్AI తదితర కంపెనీల మీద న్యూస్ పేపర్ల నుంచి రచయితల వరకు భారీ కేసులు నమోదు చేశారు.

ఇంతేనా! AI మన వెటకారాన్ని అర్థం చేసుకోలేదు, నర్మగర్భమైన మాటలు గ్రహించలేదు! బొమ్మ గీయగలదు కానీ అందులో సృజన ఉండదు, కవిత రాయగలదు కానీ అందులో మనసు కనిపించదు. ఒక్క మాటలో చెప్పాలంటే కృత్రిమ మేధ ఎప్పటికీ మనిషి కాదు.

### స్వారీ చేయడమే!

కృత్రిమ మేధతో కొన్ని పనులు సులువుగా అయిపోతున్నాయి. లాభాల గురించే కంపెనీలు సహజంగానే, మనుషుల కంటే కృత్రిమ మేధకే మొగ్గు చూపుతున్నాయి. కొన్ని లక్షల ఉద్యోగాలు హరించుకుపోతున్నాయి. ఆ మార్పును మనం ఆపలేం. ఎదిరిస్తూ ఉంటే పుణ్యకాలం చేజారిపోతుంది. అందుకే దాన్ని మనకు అనుకూలంగా మార్చుకోవడం ఎలా, మన ఉపాధికి గండి పడకుండా చూసుకోవడం ఎలా అన్నదే మన ప్రాధాన్యంగా ఉండాలి.

- AI టూల్స్‌ని ఎలా ఉపయోగించుకోవడం, వాటికి prompts ఇవ్వడం ఎలా అన్నది ఇప్పుడు రాజ్యమేలుతున్న కళ. కృత్రిమ మేధ ఎలా పనిచేస్తుంది, దాన్ని ఎలా ఉపయోగించుకోవాలి అన్న అంశాల మీద స్పష్టత లేని ఈ సమయంలో... వాటిలో నిపుణులకు కొద్దికాలం మంచి మార్కెట్ ఉండబోతున్నది.
- కృత్రిమ మేధను ఉపాధిగా మార్చుకునే అవకాశాలు బోలెడు. ఉదాహరణకు ఓ ట్రెండింగ్ టాపిక్ మీద కంటెంట్ రాసి, దానికి స్వరాన్ని అందించి, వీడియోగా రూపొందించడం వరకూ అన్నీ AI ద్వారా సాధ్యమే! మనం అంతగా నిష్ణాతులు కాని రంగాల్లో AI సాయంతో అద్భుతాలు చేయవచ్చు.
- చాలామంది ఓ రంగంలోకి అడుగుపెట్టాక, ఇక తమ నేర్పును మెరుగుపరుచుకోరు. కొత్త నైపుణ్యాలను అలవర్చుకోరు. ఈ Upskilling, Reskilling లేకపోతే, కత్తివాదర పదునున్నా నేటి కెరీర్లో ప్రయాణం కష్టమైపోతుంది. ఏ కొత్త మార్పును తట్టుకోలేం. ఉద్యోగం చేజారితే, మరో అవకాశాన్ని అందుకోలేం.
- అయితే ఇంజినీరింగ్ లేదా డాక్టర్! అయితే అకౌంటెంట్ లేదా ఏంబీఏ... కొన్ని దశాబ్దాల తరబడి కెరీర్ కోసం ఏదో ఒక ట్రెండ్ అనుసరిస్తూ ఉంటాం. కాలం వేగంగా మారిపోతున్న ఈ సమయంలో ఎప్పటికప్పుడు అవసరాలను గమనించుకోవాలి. ఉపాధి రంగం ఓ మార్కెట్... మన దగ్గర ఏముందో అది వాకబు చేయదు. దానికి ఏం కావాలో మనమే అందించే ప్రయత్నం చేయాలి. గిరాకీ మన చేతిలో ఉండాలి. బేల చూపులు చూస్తే కార్పొరేట్ రంగం జాలిపడదు.
- కఠోరమైనా ఓ విషయాన్ని గుర్తుంచుకోవాలి. రాబోయే రోజుల్లో శరీర శ్రమకు డిమాండ్ పెరిగిపోతుంది. శరీరాలు సుతారంగా మారిపోయి, మెదడు సాంకేతికతతో మొద్దుబారిపోయి ఉంటే... వచ్చే నాలుగు రూపాయలూ పనివాళ్లకే ఇచ్చుకోవాలి. మనకు ఏ పనీ లేకపోతే శరీర శ్రమ చేసి సంపాదించే అవకాశమూ ఉండదు.
- డెవ్లిన్ డొనాల్డ్‌సన్ అనే వ్యక్తి నిరంతరం తన శ్రమను, ఆహారాన్ని గమనించే ఓ యాప్ సాయంతో మూడేండ్లలో షుగర్ వ్యాధి నుంచి బయటపడటమే కాకుండా ఏకంగా 18 కిలోల బరువు తగ్గాడు. కృత్రిమ మేధతో పనిచేసే పరికరాలను విచక్షణతో వాడితే ఎంత ఉపయోగమే చెప్పే సాక్ష్యమిది!

